సాక్షి
నిర్మల్
గురువారం । 4 । మే । 2023



'అంగన్‌వాడీ'లకు సన్నబియ్యం

అంగన్‌వాడీ కేంద్రాలకు ఇకపై సన్నబియ్యం సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మంత్రి సత్యవతి రాథోడ్ సంపూర్ణ ఆహార పథకం ఫైల్‌పై సంతకం చేశారు. 8లో▸



వేసవి దుక్కులతో లాభాలు

వేసవి దుక్కులతో అనేక లాభాలున్నాయి. నేల గుల్లబారి నీటి నిల్వ శాతం పెరుగుతుంది. మొండి జాతి కలుపుమొక్కలు ఎండిపోతాయి. కలుపు సమస్య తగ్గుతుంది. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0 /24.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడా వానలు పడే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఓటరుజాబితాపై అభ్యంతరాలుంటే తెలపాలి



మాట్లాడుతున్న ఆర్డీవో రవికుమార్

భైంసాటౌన్: ఓటరు జాబితాలో అభ్యంతరాలు, సలహాలు, సూచనలు తెలపాలని భైంసా ఆర్డీవో రవికుమార్ సూచించారు. బుధవారం భైంసాలోని తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయపార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. జనవరి 5న ప్రదర్శించిన ఓటరుజాబితాలో ఏవైనా మార్పులు, చేర్పులుంటే సూచించాలని, అలాగే ఓటరుకార్డుకు ఆధార్ అనుసంధానం చేసుకోనివారు చేసుకోవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు పాల్గొన్నారు.

రాజోలు బస్సు ప్రారంభం



బస్సు ప్రారంభిస్తున్న డీఎం సాయన్న

నిర్మల్ టౌన్: నిర్మల్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని రాజోలుకు సూపర్ లగ్జరీ బస్సును బుధవారం ఆర్టీసీ డిపో మేనేజర్ సాయన్న ప్రారంభించారు. బస్సు ప్రతీరోజు మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరుతుందని తెలిపారు. హైదరాబాద్, విజయవాడ, భీమవరం, పాలకొల్లు మీదుగా రాజోలుకు మరుసటిరోజు ఉదయం 5గంటలకు చేరుకుంటుందని పేర్కొన్నారు. తిరిగి అదేరోజు సాయంత్రం 7గంటలకు నిర్మల్‌కు బయలుదేరుతుందని తెలిపారు.


వైద్యశిబిరాలు వినియోగించుకోవాలి



శిబిరాన్ని పరిశీలిస్తున్న శ్రావణి

భైంసాటౌన్: భవన నిర్మాణ కార్మికులకు అందిస్తున్న ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని కార్మికశాఖ భైంసా ఇన్‌చార్జి అధికారి శ్రావణి సూచించారు. బుధవారం భైంసా పట్టణంతోపాటు మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో పలువురు కార్మికులకు 50 రకాల వైద్యపరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. మే డే ఉత్సవాల్లో భాగంగా ఈనెల 1, 2, 3 తేదీల్లో కార్మికులకు ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికశాఖలో పేర్లు నమోదు చేసుకున్నవారు ఐడీ కార్డును మీసేవలో రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. కార్మికులుగా నమోదైనవారికే పథకాలు వర్తిస్తాయని స్పష్టం చేశారు.

దివ్యాంగులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న సాయన్న

నిర్మల్‌చైన్‌గేట్: దళితబంధు తరహాలో దివ్యాంగులకు 'వికలాంగబంధు' అమలు చేసి ఆదుకోవాలని తెలంగాణ దివ్యాంగుల పునరావాస్ అభివృద్ధి ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సట్టి సాయన్న డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 2016లో పీడబ్ల్యూడీ ఆక్ట్ వికలాంగుల హక్కుల కోసం తీసుకువచ్చిందని తెలిపారు. దీనిని అన్ని శాఖలు కచ్చితంగా పాటించి దివ్యాంగులకు ఐదుశాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. విద్య, ఉద్యోగం, వైద్యం, డబుల్ బెడ్రూం, రుణ సౌకర్యం కల్పించాలని సాయన్న డిమాండ్ చేశారు.

స్వచ్ఛందంగా గుంతలు పూడ్చివేత



గుంతలు పూడ్చివేస్తున్న రాహుల్‌నగర్‌వాసులు

భైంసాటౌన్: పట్టణంలోని రాహుల్‌నగర్‌లో మిషన్ భగీరథ పైపులైన్ వేసి గుంతలు సకాలంలో పూడ్చివేయకపోవడంతో వాహనదారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళ గుంతలు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో బుధవారం పలువురు కాలనీవాసులు స్వచ్ఛందంగా గుంతలు పూడ్చివేసి సమస్య పరిష్కరించుకున్నారు. ఈ విషయం 'సాక్షి' పబ్లిక్ హెల్త్ విభాగం డీఈఈ సంతోష్ దృష్టికి తీసుకువెళ్లగా, వెంటనే జేసీబీతో గుంతలు పూడ్చివేయించారు.

మీ రాక కోసం.. నిరీక్షణ!



పూర్తయిన సమీకృత కలెక్టరేట్ భవనం



పంపిణీకి సిద్ధంగా డబుల్‌బెడ్రూం ఇళ్లు

- సీఎం జిల్లా పర్యటనపై స్పష్టత కరువు
- 'డబుల్ ఇళ్ల' కోసం లబ్ధిదారులు
- పూర్తయిన సమీకృత కలెక్టరేట్
- ఎదురుచూస్తున్న బీఆర్‌ఎస్ భవన్
- మెడికల్ కళాశాలకు శంకుస్థాపన
- రెండోవారంలోనైనా కేసీఆర్ వచ్చేనా?

నిర్మల్: ఏప్రిల్ నెలాఖరువరకు ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాకు వస్తారని రెండునెలల క్రితం ప్రకటించారు. ఆ తర్వాత మే మొదటివారంలో మంచిరోజులున్నాయని.. అప్పుడే వచ్చి అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తారని చెప్పారు. తీరా.. మే మొదటివారం కూడా ప్రారంభమైంది. ఇప్పటికీ సీఎం రాకపై ఎలాంటి క్లారిటీ రాలేదు. మొన్న కొత్త సచివాలయం ప్రారంభించిన కేసీఆర్ గురువారం ఢిల్లీలో బీఆర్‌ఎస్ భవన్‌ను ప్రారంభించనున్నారు. ఆ తర్వాత ఈనెల రెండోవారం నుంచి జిల్లాల పర్యటన ఉండే అవకాశం ఉన్నట్లు బీఆర్‌ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు సీఎం రాక కోసం పలు అభివృద్ధి పనులతో పాటు పలువురు లబ్ధిదారులూ నిరీక్షిస్తున్నారు. జిల్లాకేంద్రంలో నిర్మించిన సమీకృత కలెక్టరేట్ ప్రారంభోత్సవంతో పాటు డబుల్‌బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు అందించడం, బీఆర్‌ఎస్ భవన్ ప్రారంభం, మెడికల్ కళాశాలకు శంకుస్థాపన తదితర పనులు వెయిటింగ్‌లో ఉన్నాయి. ఈనెల రెండోవారంలోనైనా సీఎం వస్తారా? అన్న జిల్లావాసుల ఎదురుచూపులు కొనసాగుతున్నాయి.

పూర్తయిన 'సమీకృతం'..

జిల్లాకు గుండెకాయగా భావించే సమీకృత కలెక్టరేట్ కార్యాలయ భవనం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. జిల్లాకేంద్రం–ఎల్లపెల్లి శివారులో చేపట్టిన ఈ భవన నిర్మాణం ఏళ్లపాటు సమయం తీసుకుంది. ఎప్పుడో పూర్తికావాల్సిన కొత్త కలెక్టరేట్‌కు ఆదిలోనే హంసపాదు అన్నట్లు స్థల నిర్ధారణ అడ్డంకిగా మారింది. మొదట భీమన్న గుట్టపై అడ్డంకులు రావడం, రెండోసారి కొచ్చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఉండడం, కాంట్రాక్టర్ జాప్యం.. ఇలా పలు కారణాలతో ఏళ్ల తరబడి నిర్మాణ పనులు కొనసాగాయి. స్వయంగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్లు తరచూ పరిశీలన చేపట్టడంతో ఎట్టకేలకు పూర్తయింది. మొత్తం 15ఎకరాల్లో రూ.52కోట్లతో నిర్మించారు. ఇది కూడా సీఎం చేతుల మీదుగా ప్రారంభానికి వేచిచూస్తోంది.

లబ్ధిదారుల ఎదురుచూపు..

జిల్లాలో వేలమంది లబ్ధిదారులు డబుల్‌బెడ్రూం ఇళ్ల కోసం వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. ఎప్పుడో నిర్మాణాలు పూర్తిచేసుకున్నా.. ఇప్పటికీ అందకపోవడంతో వారంతా ఇంకెప్పుడిస్తారంటూ నిట్టూరుస్తున్నారు. నిర్మల్‌తో పాటు ముధోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లోనూ కలిపి దాదాపు 2,400ఇళ్లకు లబ్ధిదారులను ఎంపికచేసినప్పటికీ సీఎం చేతుల మీదుగా ఇప్పించాలన్న కారణంతో నెలలుగా వేచి ఉంచుతున్నారు. నిర్మల్ పట్టణంలోనే 1,460 ఇళ్లను లబ్ధిదారులకు అందించాల్సి ఉంది. భైంసాలో 200, ఖానాపూర్‌లో 400వరకు ఇవ్వాల్సి ఉంది. ఇవి కాకుండా రూరల్ ఏరియాలో నిర్మించిన ఇళ్లనూ అందించాల్సి ఉంది. ఇప్పటివరకు నిర్మల్, ముధోల్ నియోజకవర్గాల్లో కలిపి 395 ఇళ్లు మాత్రమే లబ్ధిదారులకు అందించారు.

బీఆర్‌ఎస్ కార్యాలయం కూడా..

జిల్లాకో తెలంగాణ భవన్ ఉండాలన్న ఉద్దేశంతో జిల్లాకేంద్రంలోనూ బీఆర్‌ఎస్ ఆఫీస్‌ను నిర్మించారు. స్థానిక కొండాపూర్ బైపాస్ రోడ్డు పక్కనే మూడేళ్లక్రితమే ఈ భవన నిర్మాణం పూర్తిచేసుకున్నా.. ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోవడం లేదు. గులాబీ శ్రేణులకు తమకంటూ పార్టీ ఆఫీస్ లేకపోవడంతో ప్రస్తుతం జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే అధికారిక క్యాంప్ ఆఫీస్‌లోనే ప్రెస్‌మీట్లు పెడుతూ దాన్ని అనధికారిక పార్టీ కార్యాలయంగా వాడుకుంటున్నారు. కొత్త కలెక్టరేట్‌తో పాటు బీఆర్‌ఎస్ భవనాన్ని ముఖ్యమంత్రి కేసీఆరే ప్రారంభించాల్సి ఉంది.

ప్రారంభానికి కలెక్టరేట్ సిద్ధం

అన్నిశాఖల జిల్లా కార్యాలయాలు ఒకేచోట ఉండేలా సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణం పూర్తయింది. ఈమేరకు భవనం ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నట్లు సీఎంవోకు సమాచారాన్ని కూడా అందించాం.

– అశోక్‌కుమార్, ఆర్‌అండ్‌బీ ఈఈ

పలు అభివృద్ధి పనులు..

ఎన్నికలు కాగానే జిల్లాకు వచ్చి కూర్చుంటానని.. ఇక్కడే ఉండి అభివృద్ధి పనులన్నీ చేయిస్తానని 2018 ఎన్నికల సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారు. ప్రధానంగా మెడికల్ కళాశాల, నిర్మల్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, ఆర్మూర్–నిర్మల్–ఆదిలాబాద్ రైల్వేలైన్ హామీలిచ్చారు. ఇందులో జిల్లా ప్రజల కలగా పేర్కొనే మెడికల కళాశాలను మంజూరు చేశారు. కాలేజీ నూతన భవనానికి సీఎం శంకుస్థాపన చేసే అవకాశాలున్నట్లు చెబుతున్నారు. ఇక తన నియోజకవర్గమైన గజ్వేల్‌తో పాటు నిర్మల్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్న మాట ఇప్పటికీ అలాగే ఉండిపోయింది. రైల్వేలైన్ విషయంలో కేంద్ర, రాష్ట్రాలు పట్టింపులేకుండా ఉన్నాయి. ఎప్పుడో కావాల్సిన సర్వే ఇటీవలే పూర్తిచేశారు. ఇక ఈ లైన్ నిర్మాణం మరిచిపోవాలని జిల్లావాసులే చెబుతున్నారు.

గల్ఫ్ బాధితులకు ఉపాధి శిక్షణ

నిర్మల్ ఖిల్లా: గల్ఫ్ దేశాల నుంచి వాపస్ వచ్చిన కార్మికులకు ఉపాధి కల్పించేందుకు శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రవాసీమిత్ర కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పర్కిపండ్ల తెలిపారు. జిల్లాకేంద్రంలోని సంఘ కార్యాలయంలో బుధవారం వివరాలు వెల్లడించారు. ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్, తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్), తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన శాఖల సమన్వయంతో హెవీ వెహికల్ డ్రైవర్లుగా శిక్షణ పొందేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఉచిత వసతి, భోజనం, ప్లేస్‌మెంట్ అవకాశాలతో 30 రోజుల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈనెల 16 నుంచి కొత్త బ్యాచ్‌కు శిక్షణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. 22–35 ఏళ్లవారు తమ లైట్ వెహికల్ లెర్నర్స్ లైసెన్స్ నంబర్, చిరునామా, గల్ఫ్ దేశం నుంచి వాపసు వచ్చిన వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డ్రైవర్లుగా అభిరుచి ఉండి స్థానికంగా ఉపాధి అవకాశాల కోసం ఉత్సాహం ఉన్నవారు ఉచిత శిక్షణను వినియోగించుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు ప్రాజెక్ట్ సమన్వయకర్త త్రిలోక్ చందన్‌గౌడ్‌ను 9493460031 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా సంక్షేమ, మహిళాశిశు వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ పరిధిలోని జిల్లా మహిళల సాధికారత కేంద్రంలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసేందుకు మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఆర్డీవో విజయలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా మిషన్ కో ఆర్డినేటర్–1, జెండర్ స్పెషలిస్ట్–1, స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్షియల్ లిటరసీ–1, అకౌంట్స్ అసిస్టెంట్–1, ఎంటీఎస్–1 పోస్టులు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు విద్యార్హతలు, చిరునామాతో ఈ నెల 10లోపు జిల్లా సంక్షేమాధికారిణి, మహిళా, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయంలో అందించాలని తెలిపారు. పూర్తి వివరాలకు https://nirmal, telangana.gov.in సంప్రదించాలని డీఆర్డీవో సూచించారు.

కల నెరవేరింది..

- కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ సర్కారు ఆదేశాలు
- జిల్లాలో 508 మందికి లబ్ధి



నిర్మల్‌చైన్‌గేట్: ఎంతో కాలంగా రెగ్యులరైజేషన్ కోసం ఎదురుచూస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. తెలంగాణ నూతన సచివాలయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రంలోని పలు విభాగాల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న సిబ్బంది రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన ఫైల్‌పై ఆదివారం ముఖ్యమంత్రి కేసీఆర్ సంతకం చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వివిధ శాఖల్లో 10నుంచి 23ఏళ్లుగా పనిచేస్తున్న సిబ్బందిని ఇక నుంచి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించనున్నారు.

508 మందికి ప్రయోజనం

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న 508 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు లబ్ధి పొందనున్నారు. జూనియర్ కాలేజీల్లో పనిచేసే కాంట్రాక్ట్ అధ్యాపకులు 134మంది, డిగ్రీ కాలేజీల్లో పని చేసే 15మంది, పాలిటెక్నిక్ కాలేజీలో పని చేసే ఐదుగురు, వైద్యశాఖలో పనిచేసే వందమందితోపాటు ఇతర విభాగాల్లోని మరో 254 మందికి ప్రయోజనం దక్కింది.

నెరవేరిన రెండు దశాబ్దాల కల

రెండు దశాబ్దాలకు పైగా ప్రభుత్వ కళాశాలల్లో కాంట్రాక్ట్ అధ్యాపకులుగా పనిచేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేస్తూ 2018 ఫిబ్రవరి 26న తెలంగాణ ప్రభుత్వం జీవో జారీచేసింది. దీనిపై కొందరు కోర్టుకెళ్లడంతో క్రమబద్ధీకరణ నిలిచిపోయింది. 2017 జూన్ 16న కాంట్రాక్ట్ అధ్యాపకుల వేతనాన్ని రూ.18వేల నుంచి రూ.37,100 బేసిక్ చేస్తూ జీవో జారీ చేసింది. కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఏడాదిలో 10 నెలలు మాత్రమే వేతనాలు చెల్లించేది. దీన్ని సవరిస్తూ 12 నెలలు జీతాలు ఇచ్చేలా జీవో 222ని 2018 సెప్టెంబర్ 5న జారీ చేసింది. పీఆర్సీని వర్తింపజేస్తూ 2021 జూన్ 17న జీవో 105 జారీ చేసింది. దీంతో వీరి వేతనం రూ.37,100 నుంచి రూ.54,200కు చేరింది. డిగ్రీ, పాలిటెక్నిక్ కాంట్రాక్ట్ అధ్యాపకులకు కూడా వేతనాలు పెంచుతూ జీవో జారీ చేసింది. దీంతో వారి వేతనం కూడా రూ.40,270 నుంచి రూ.58,850కి చేరింది. తాజాగా ప్రభుత్వం జారీ చేసిన జీవోతో కాంట్రాక్ట్ అధ్యాపకులంతా ప్రభుత్వ ఉద్యోగులుగా గౌరవం పొందనున్నారు.

ఆనందం.. అనుమానం..

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసినప్పటికీ కొందరు ఉద్యోగులు పూర్తిగా నమ్మలేకపోతున్నారు. ఒకవేళ ఎవరైనా కోర్టుకు వెళ్తే మళ్లీ కథ మొదటికి వస్తుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులరైజ్ చేస్తామని జీవో విడుదల చేస్తున్న ఆనందం ఒకవైపు ఉండగా.. పూర్తిస్థాయిలో నియామక ప్రక్రియ జరిగేవరకూ నమ్మేలా లేదని మరికొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో కాంట్రాక్ట్ ఉద్యోగుల వివరాలు

జూనియర్ కాలేజీ అధ్యాపకులు	134
డిగ్రీ కాలేజీ అధ్యాపకులు	15
పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు	5
వైద్యశాఖ సిబ్బంది	100
ఇతర శాఖలోని సిబ్బంది	254

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



నేను ఖానాపూర్ జూనియర్ కళాశాలలో 15 ఏళ్లుగా అధ్యాపకుడిగా కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న. సీఎం కేసీఆర్ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడంతో మా జీవితాల్లో వెలుగులు వచ్చాయి. కేసీఆర్‌కు ధన్యవాదాలు.

– సిర్గ రవికుమార్, కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ

17 ఏళ్ల కల నెరవేరింది



నేను ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అధ్యాపకురాలిగా 17 ఏళ్లుగా పని చేస్తున్న. రెండు దశాబ్దాలుగా క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూస్తున్నాం. ఎట్టకేలకు మా కల నెరవేరింది. సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటం.

– పద్మ, కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘం ఎగ్జిక్యూటివ్ మెంబర్

నిరుపేదలకు అండగా కల్యాణలక్ష్మి

- రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- లబ్ధిదారులకు చెక్కులు అందజేత




లక్ష్మణచాందలో చెక్కు ఇస్తున్న మంత్రి ఐకేరెడ్డి

లక్ష్మణచాంద: కల్యాణలక్ష్మి నిరుపేద కుటుంబాలకు వరంగా మారిందని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో మంత్రి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 70మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఇద్దరికి రైతుబీమా చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తామని చెప్పారు. ఆర్డీవో స్రవంతి, డీసీసీబీ వైస్ చైర్మన్ ఎర్ర రఘునందన్‌రెడ్డి, ఎంపీపీ అడ్వాల పద్మ, జెడ్పీటీసీ రాజేశ్వర్, తహసీల్దార్ కవితారెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేశ్, మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు గంగారాం, ముత్యం, సురేశ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా ఆలయాలు

మామడ: రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయేలా ప్రభుత్వం ఆలయాల నిర్మాణం చేపడుతోందని రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. న్యూసాంగ్వి గ్రామంలో నిర్మించిన సాయిబాబా ఆలయంలో చేపట్టిన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయంలో పూజలు చేశారు. ఆవరణలో మొక్క నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రూ.12 కోట్లతో అడెల్లి పోచమ్మ ఆలయాన్ని కృష్ణశిలతో తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. జెడ్పీ చైర్‌పర్సన్ కొరిపెల్లి విజయలక్ష్మిరాంకిషన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఏనుగు లింగారెడ్డి, సర్పంచ్ సుజాత, నాయకులు గంగారెడ్డి, భూషణ్‌రెడ్డి, వికాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీడీవో రమేశ్, చంద్రశేఖర్‌గౌడ్ ఉన్నారు.

కలెక్టరేట్ ఎదుట వీవోఏల ధర్నా



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన వీవోఏలు

నిర్మల్‌చైన్‌గేట్: సమస్యలు పరిష్కరించాలని వీవోఏలు చేపట్టిన సమ్మె 15వ రోజుకు చేరింది. బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమ్మె శిబిరానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వీవోఏలు అనంతరం ధర్నా చేశారు. తర్వాత ర్యాలీగా వెళ్లి ట్యాంక్‌బండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు వీరికి సంఘీభావం ప్రకటించారు. వీవోఏల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు లలిత, జిల్లా అధ్యక్షురాలు జయశీల, సాయన్న, ప్రభాకర్‌రాజు, మహేశ్, స్వప్న, గాయత్రి, గంగాజల, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

విభజన కొలిక్కి!

- కొత్త జిల్లాల వారీగా జిల్లా పరిషత్ జీపీఎఫ్ వివరాలు
- సిద్ధమైన ఉద్యోగులు, ఖాతాల జాబితా
- ట్రెజరీల ద్వారా ఆయా జెడ్పీలకు త్వరలోనే మార్పు
- తీరనున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల వెతలు

కైలాస్‌నగర్: ఇప్పటివరకు ఆదిలాబాద్ కేంద్రంగా సాగుతున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ జీపీఎఫ్ (సాధారణ భవిష్య నిధి) పునర్విభజనకు ఎట్టకేలకు రంగం సిద్ధమైంది. జెడ్పీల పునర్విభజన జరిగిన ఐదేళ్ల తర్వాత ప్రభుత్వం దీనిపై దృష్టి సారించింది. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ నుంచి గత నెల 28న ఆదేశాలు జారీ అయ్యాయి. తదనుగుణంగా జెడ్పీ అధికారులు జిల్లాల వారీగా ఉద్యోగులు, వారి జీపీఎఫ్ సొమ్ము, వడ్డీ వంటి సమగ్ర సమాచారాన్ని పునర్విభజన చేస్తున్నారు. వారం రోజులుగా చేపట్టిన ఈ ప్రక్రియ తుది దశకు చేరింది. రెండు, మూడు రోజుల్లో జీపీఎఫ్ వ్యవహారాలన్నీ ఆయా జిల్లాల జెడ్పీ పరిధిలోకి మారనున్నట్లుగా అధికారులు చెబుతున్నారు. దీంతో ఇక జీపీఎఫ్ సొమ్ము కోసం మంచిర్యాల, కుమురంభీం, నిర్మల్ జిల్లాల ఉద్యోగ, ఉపాధ్యాయుల అవస్థలు దూరం కానున్నాయి. వారి సొంత జిల్లాలోనే ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

ఐదేళ్లుగా అవస్థలు

జిల్లా పరిషత్ ఆధీనంలో పనిచేసే ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీపీఎఫ్ సదుపాయం ఉంటుంది. ఇలా దాచుకున్న మొత్తాన్ని తమ పిల్లల వివాహాలు, చదువులు, గృహ నిర్మాణాలు, కుటుంబసభ్యుల ఆరోగ్య సమస్యలకు వినియోగించుకుంటారు. ఈ సొమ్ముకు ప్రభుత్వం వడ్డీ సైతం జమచేస్తోంది. అలాగే వారి అవసరాలకు అందజేస్తుంటుంది. ఇందుకు జెడ్పీలో జీపీఎఫ్ ప్రత్యేక విభాగం పనిచేస్తోంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం పాలన సౌలభ్యం కోసం ఉమ్మడి ఆదిలాబాద్ జెడ్పీని నాలుగు జిల్లాలుగా 2019 జూలై 5న పునర్విభజించింది. అప్పటినుంచి కొత్తగా ఏర్పడ్డ మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్ జెడ్పీల్లో పాలన నడుస్తున్నా జీపీఎఫ్ వ్యవహారాలు మాత్రం ఇప్పటికీ ఆదిలాబాద్ జిల్లా కేంద్రంగానే సాగుతున్నాయి. దీంతో వాటి కోసం ఈ మూడు జిల్లాల్లోని దూర ప్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయులు ఐదేళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా కుమురంభీం జిల్లాలోని బెజ్జూర్, కెరమెరితో పాటు మంచిర్యాల జిల్లాలోని వేమనపల్లి, చెన్నూర్ వంటి ప్రాంతాల ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆదిలాబాద్‌కు వచ్చి వెళ్లాలంటే రెండు రోజులు కేటాయించాల్సిందే.



జిల్లా పరిషత్ కార్యాలయం

తుదిదశకు కసరత్తు

అవసర నిమిత్తం దాచుకున్న సొమ్ము కోసం జీపీఎఫ్‌కు దరఖాస్తు చేసుకుని దాన్ని అందజేయాలంటే ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర వ్యయ, ప్రయాసలకు గురికావాల్సి వచ్చేది. ఈ క్రమంలో స్థానికంగానే జీపీఎఫ్‌ను నిర్వహించాలంటూ కొన్ని జిల్లాల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు కూడా చేపట్టారు. వీటిని గమనించిన రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు జీపీఎఫ్‌ను పునర్విభజన చేయాలని నిర్ణయిస్తూ ఆదేశాలు జారీచేసింది. వాటి కనుగుణంగా జెడ్పీ అధికారులు గత నెల 28నుంచి కసరత్తు చేపట్టారు. ఒక్కో జెడ్పీ నుంచి సూపరింటెండెంట్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టు ఇలా నలుగురు చొప్పున నాలుగు జిల్లాల నుంచి 16మంది జీపీఎఫ్ వివరాల పునర్విభజనలో నిమగ్నమయ్యారు. జిల్లాల వారీగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వారు దాచుకున్న సొమ్ము, రావాల్సిన వడ్డీ, బ్యాంకు ఖాతాల నంబర్లు తదితర వివరాల జాబితాలను సిద్ధం చేశారు. ఈ వివరాలను ట్రెజరీల ద్వారా ఆయా జెడ్పీలకు పంపనున్నారు. ఈ ప్రక్రియ రెండు రోజుల్లో పూర్తి కానుందని అధికారులు చెబుతున్నారు.

14 ఏళ్లుగా జాడలేని వడ్డీ

ఉద్యోగ, ఉపాధ్యాయుల జీపీఎఫ్‌కు సంబంధించి వారు దాచుకున్న సొమ్ముకు ప్రభుత్వం వడ్డీ చెల్లిస్తోంది. అయితే 2009 నుంచి ప్రభుత్వం దీనికి వడ్డీ చెల్లించడం లేదు. ఒక్కో నెల ఉమ్మడి జిల్లాలో జీపీఎఫ్ సొమ్ము రూ.5కోట్లు జమ అవుతుందని ఈ లెక్కన గత 14 ఏళ్లలో రూ.225 కోట్ల వడ్డీ ప్రభుత్వం నుంచి రావాల్సి ఉన్నట్లుగా జెడ్పీ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న రూ.200.20 కోట్లను నాలుగు జిల్లాలకు విభజన చేస్తున్నట్లుగా తెలిపారు. ఆయా జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల సంఖ్యకనుగుణంగా ఈ నిధులను పంపిణీ చేయనున్నట్లుగా చెబుతున్నారు. వడ్డీ నిధులు విడుదలయ్యాక వాటిని కూడా జిల్లాల వారీగా అందజేస్తామని పేర్కొంటున్నారు.

ఉమ్మడి జిల్లా వారీగా జెడ్పీ పరిధిలోని ఉద్యోగులు, వారి జీపీఎఫ్ సొమ్ము వివరాలు

జిల్లా	ఉద్యోగుల సంఖ్య	జీపీఎఫ్ సొమ్ము
ఆదిలాబాద్	1,908	రూ.90 కోట్లు
నిర్మల్	1,579	రూ.50 కోట్లు
మంచిర్యాల	1,506	రూ.50కోట్లు
కుమురంభీం	591	రూ.30కోట్లు

తుదిదశకు విభజన ప్రక్రియ



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల జీపీఎఫ్ వివరాల పునర్విభజన ప్రక్రియ తుది దశకు చేరింది. జిల్లాల వారీగా ఉద్యోగ, ఉపాధ్యాయులు, వారికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సిద్ధం చేశాం. వీటిని రెండు రోజుల్లో ట్రెజరీల ద్వారా ఆయా జెడ్పీలకు పంపుతాం. ఆ వెంటనే ఆయా జిల్లాల వారీగా జీపీఎఫ్ వ్యవహారాలు కొనసాగుతాయి. ఇక ఉద్యోగులు సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడికి రావాల్సిన అవసరం ఉండదు. సకాలంలో సేవలు పొందే వెసులుబాటు కలుగుతుంది.

– వి.గణపతి, జెడ్పీ సీఈవో, ఆదిలాబాద్

క్లుప్తంగా

గంజాయి మొక్కలు స్వాధీనం

బోథ్: మండలంలోని సొనాల గ్రామ శివారులో ఓ చేనులో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను సీఐ కిరణ్ కుమార్, ఎస్సై రవీందర్ బుధవారం పట్టుకున్నారు. సీఐ వివరాల ప్రకారం.. సమాచారం మేరకు ఆత్రం శ్రీకాంత్ అనే వ్యక్తి చేను కౌలుకు తీసుకుని మొక్కజొన్న పంట వేశాడు. పంటలో అక్కడక్కడ గంజాయి మొక్కలు సాగు చేశాడు. 17 మొక్కలను గుర్తించి కాల్చివేసినట్లు తెలిపారు.లించగా 17 గంజాయి మొక్కలు లభించాయి.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

భైంసారూరల్: మండలంలోని వాలేగాం గ్రామానికి చెందిన సాయినాథ్(30) ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం.. కొన్నేళ్లుగా ఏ పనీ లేకుండా మద్యానికి బానిసగా మారాడు. ఈ క్రమంలో బుధవారం ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశానికి లక్కీడ్రా



లక్కీడ్రా నిర్వహిస్తున్న డీడీ దిలీప్‌కుమార్

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఒకటో తరగతిలో ప్రవేశానికి బుధవారం లక్కీడ్రా ద్వారా విద్యార్థులను ఎంపిక చేసినట్లు డీడీ దిలీప్‌కుమార్ తెలిపారు. డ్రాలో ఎర్మాసూర్యభాన్, హెరకుమ్ర రిత్విక్ ధన్‌రాజ్, జుగ్నక్ హరిచైతన్య, రాథోడ్ చందర్, సెడ్మకి సహస్ర ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీవోఈ సెట్ ఫలితాల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



సత్యానంద్ రిత్విక్ శరత్ చంద్ర

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ గురుకుల బాలుర పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు సీవోఈ ఫలితాల్లో సీటు పొందినట్లు ప్రిన్సిపాల్ సంతోష్ తెలిపారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సెట్ ఫలితాల్లో మండలంలోని రాచాపూర్ గ్రామంలోని మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల బాలుర పాఠశాలకు చెందిన సత్యానంద్, రిత్విక్, శరత్ చంద్రలు సీటు సాధించగా వారిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

పెళ్లి పేరుతో మోసం చేసిన యువకుడిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని పెళ్లి చేసుకుంటానని గర్భవతి చేసి అనంతరం పెళ్లికి నిరాకరించిన జైనూర్ మండలానికి చెందిన యువకుడిపై కేసు నమోదు చేసిన్నట్లు ఎస్సై నాగనాథ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి గ్రామానికి జైనూర్ మండలానికి చెందిన యువకుడు వారి బంధువుల ఇంటికి వచ్చేవాడు. ఈ క్రమంలో ఇరువురు రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ప్రస్తుతం ఆ యువతి 8 నెలల గర్భవతి. పెళ్లికి నిరాకరించడంతో యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు, లబ్ధిదారుల వివరాలు

జిల్లా	అంగన్‌వాడీ కేంద్రాలు	గర్భిణులు	బాలింతలు	చిన్నారులు	రేషన్ బియ్యం
మంచిర్యాల	969	4,701	3,942	39,760	59,150 కిలోలు
నిర్మల్	926	5809	6405	61298	414 మెట్రిక్ టన్నులు
కుమురంభీం	973	4858	5227	44417	53588 కిలోలు
ఆదిలాబాద్	1256	3776	4205	49568	70 టన్నులు



'అంగన్‌వాడీ'లకు సన్నబియ్యం

- చిన్నారులు, గర్భిణులకు ఉపయోగం
- దొడ్డు బియ్యంతో భోజనం చేసేందుకు అనాసక్తి

మంచిర్యాలటౌన్: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సరైన పౌష్టికాహారం అందించేందుకు ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలకు ఇన్నాళ్లు పోషకాలతో కూడిన దొడ్డు బియ్యం అందిస్తున్న ప్రభుత్వం ఇకపై బలవర్ధక సన్న బియ్యం అందించాలని నిర్ణయించింది. నూతన సచివాలయం ప్రారంభం రోజునే గిరిజన మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ సంపూర్ణ ఆహార పథకం ఫైల్‌పై సంతకం చేశారు. అన్ని రకాల పోషకాలు కలిగిన బియ్యంతోనే ఇన్నాళ్లు అంగన్‌వాడీకి వచ్చే వారికి మధ్యాహ్నం భోజనం పెడుతున్నారు. ఈ బియ్యం దొడ్డుగా ఉండడంతో పిల్లలు, గర్భిణులు, బాలింతలు తినేందుకు అంతగా ఆసక్తిని చూపించడం లేదు. కొందరు మాత్రమే భోజనాలు చేస్తుండడంతో, సన్న బియ్యంతో భోజనం పెట్టాలని లబ్ధిదారుల నుంచి చాలా కాలంగా డిమాండ్ ఉంది. సన్నబియ్యంలో కంటే దొడ్డు బియ్యంలోనే పోషకాలు ఉండడంతో ఇన్నాళ్లు వాటినే ఇస్తున్నారు. సన్నబియ్యంలోనూ అన్ని రకాల పోషకాలు అందేలా చేసి వాటిని రేషన్ దుకాణాల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయనున్నారు. పూర్తిస్థాయిలో ఉత్తర్వులు వెలువడితే ఈ నెలలోనే సన్నబియ్యం అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే అవకాశం ఉంది. ఉత్తర్వులు ఆలస్యమైతే వచ్చే నెల నుంచి సన్నబియ్యంతో కూడిన భోజనాన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే అవకాశం ఉంది.



అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులు(ఫైల్)

ఉత్తర్వులు రాగానే సన్నబియ్యం అందజేస్తాం



అంగన్‌వాడీ కేంద్రాలకు సన్నబియ్యం పంపిణీకి సంబంధించిన ఉత్తర్వులు రాగానే అందిస్తాం. ప్రస్తుతం పోషకాలతో కూడిన దొడ్డు బియ్యం రేషన్ షాపుల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు అందిస్తుండగా సన్నబియ్యం వస్తే అదే క్వాంటిటీతో సన్నబియ్యం అందించడం జరుగుతుంది. పోషకాహార లోపం అధిగమించేందుకు లబ్ధిదారులందరికీ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే ఆహారం తప్పనిసరిగా తీసుకునేలా చూస్తాం.

– చిన్నయ్య, జిల్లా సంక్షేమశాఖ అధికారి, మంచిర్యాల

పోషకాహారం అందితేనే..

అంగన్‌వాడీ కేంద్రాల ముఖ్య ఉద్దేశం ప్రతి ఒక్కరికీ అవసరమైన పౌష్టికాహారం అందించడమే. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పుట్టబోయే చిన్నారుల నుంచి ఆరేళ్ల వయస్సు వరకు తల్లి, బిడ్డ ఇద్దరికీ పౌష్టికాహారం అందించి, చిన్నారుల్లో పౌష్టికాహార లోపం లేకుండా చేయాలన్న ఉద్దేశం పూర్తిస్థాయిలో నెరవేరడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుబాటులోని పౌష్టికాహారం అందిస్తున్న పూర్తిస్థాయిలో పౌష్టికాహారం అందక చిన్నారులు పౌష్టికాహార లోపంతో బలహీనంగా మారుతున్నారు. బలవర్ధక ఆహారం అందించేందుకు కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నా, పలువురు చిన్నారులు ఎత్తుకు తగిన బరువు లేకపోవడం, బరువుకు తగిన ఎత్తు లేకపోవడం, వయస్సుకు తగిన బ రువు, తీవ్ర పోషక లోపంతో బాధపడుతున్న వారి సంఖ్య మాత్రం జిల్లాలో తగ్గడం లేదు. దీనికి ము ఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న పప్పు, పాలు, కోడిగుడ్లతో పాటు, సన్నబియ్యం సక్రమంగా అందిస్తేనే పోషకాహార లోపం అధిగమించేందుకు అవకాశం ఉంటుంది. కూరగాయలు, ఆకుకూరలు, పప్పు, ఉడికించిన కోడిగుడ్డుతో భోజనం అందించడంతో పాటు, పాలు అందిస్తున్నారు. కోడిగుడ్లు చిన్నవిగా వస్తున్నాయని పలు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని లబ్ధిదారులు తీసుకునేందుకు ముందుకు రావడం లేదు. అన్నీ అంగన్‌వాడీ కేంద్రాలకు ఒకే రకమైన కోడిగుడ్లను పంపిణీ చేసేలా చర్యలను తీసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వం పౌష్టికాహారం అందించడంపై దృష్టి పెట్టడడంతో పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

ముథోల్: విద్యుత్‌షాక్ తగిలి రైతు మృతి చెందిన ఘటన బుధవారం మండలంలోని మచ్కల్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయికిరణ్ వివరాల ప్రకారం... మండలంలోని మచ్కల్ గ్రామానికి చెందిన రైతు ఆనంద్‌రావు(68) వ్యవసాయ చేసుకు బుధవారం ఉదయం పొలానికి వెళ్లాడు. జంతువుల నుంచి రక్షణ కోసం పంట చుట్టు కంచె వేయించగా గాలివానకు విద్యుత్ స్తంభం కూలి విద్యుత్ తీగలు కంచెపై పడ్డాయి. ఎప్పటిలాగే రైతు పంట చేనుకు వెళ్లగా కంచె తగిలి విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించి స్థానికులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

భైంసారూరల్: మండలంలోని పెండ్‌పెల్లి గ్రామానికి చెందిన పవార్ దిగంబర్(65) బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శ్రీకాంత్ వివరాల ప్రకారం.. నెలరోజుల క్రితం అనారోగ్యంతో భార్య మృతిని జీర్ణించుకోలేక మనస్తాపం చెందాడు. ఈ మేరకు ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు కిందపడి ఒకరు..

రామకృష్ణాపూర్(చెన్నూర్): రవీంద్రఖని రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు కిందపడి భగత్ సింగ్‌నగర్ ఏరియాకు చెందిన గాదె తిరుపతి(46) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఎత్తిపోతల పథకం పనులు అడ్డగింత

లోకేశ్వరం: మండలంలోని పిప్రి గ్రామానికి చెందిన గ్రామస్తులు ఎత్తిపోతల పథకం పనులను బుధవారం అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఇరిగేషన్ డీఈ అంజనాయక్, ఏఈ శ్రీకాంత్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. గతంలో నిర్వహించిన సర్వే ప్రకారం పనులు చేపట్టి పిప్రి గ్రామానికి పూర్తిస్థాయిలో సాగు నీరందించాలని డీఈని కోరారు. గ్రామానికి సర్వే ప్రకారంగా 250 ఎకరాలను సాగునీరందించాల్సి ఉండగా ప్రభుత్వం మొదట్లో రూ.72కోట్లు నిధులు మంజూరు చేసి పనులు చేపడుతామని ప్రకటించింది. అయితే ప్రభుత్వం రూ.59 కోట్లు మంజూరు చేసిందని, దీంతో కేవలం 80 ఎకరాలకు నీరందిస్తున్నామని అధికారులు వెల్లడించారు. పూర్తిస్థాయిలో నీటిని అందించాలని గ్రామస్తులు డీఈకి వినతిపత్రంలో కోరారు.

గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డి

ఉట్నూర్‌రూరల్: వైద్యా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గిరిజన ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వరుణ్ రెడ్డి అన్నారు. బుధవారం తెలంగాణ ప్రభుత్వం గిరిజన ఆరోగ్యాన్ని సంరక్షించుటలో భాగంగా ఐటీడీఏ ఉట్నూర్‌కు ఐదు ఆరోగ్య సంరక్షణ బృందాలను (మెడికల్ టీం) మంజూరు చేయడం జరిగిందని, రెండు బృందాలు ఆదిలాబాద్ జిల్లాకు, మరో రెండు బృందాలు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు, ఒక బృందం మంచిర్యాల జిల్లాకు కేటాయించడం జరిగిందన్నారు. ఈ బృందంలో ఒక వైద్యాధికారి, ఒక స్టాఫ్ నర్సు, మందులతో కూడిన వాహనం ఉంటుందన్నారు. బృందాలు మారుమూల గిరి ప్రాంతాలకు వెళ్లి వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. గర్భిణులు, బాలింతలను పరీక్షించి చికిత్స చేయాలని, హైరిస్క్ కేసులను గుర్తించి తగు సూచనలు, చికిత్స చేయడం, క్షయవ్యాధి, కుష్టు వ్యాధి, విరేచనాలతో బాధపడుతున్న వారిని గుర్తించి చికిత్స అందించాలని తెలిపారు. మధుమేహం, రక్తపోటు, కంటి వ్యాధులను గుర్తించి చికిత్స అందించడం జరుగుతుందన్నారు. అంతకు ముందు జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కుమురం బాలు, ఏపీవో భీంరావు, వైద్యాధికారిణి అనికేత, వైద్యాధికారి కార్తీక్, ప్రోగ్రాం మేనేజర్ జైవంథ్‌రావు, సూపర్‌వైజర్ కుమ్ర శిరీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



వాహనం ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డి

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

- రెండు టాటా మ్యాక్స్‌లను ఢీకొన్న గుర్తు తెలియని వాహనం

నేరడిగొండ: మండలంలోని లఖంపూర్ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి ఆగి ఉన్న టాటా మ్యాక్స్ వాహనాలను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. ఇచ్చోడ నుంచి టాటా మ్యాక్స్ వాహనం మార్బుల్స్ లోడ్‌తో వస్తుండగా లఖంపూర్ వద్ద టైర్ పంక్చర్ అయింది. దీంతో మరో టాటా మాక్స్ వాహనాన్ని రప్పించి అందులో లోడ్ చేస్తుండగా గుర్తు తెలియని వాహనం నిలిపి ఉన్న వాహనాలను ఢీకొనడంతో బుద్ధికొండ గ్రామానికి చెందిన తుమ్మల చిన్నలస్మారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కుంటాల గ్రామానికి చెందిన రాజాగౌడ్, మంగల్‌మోట గ్రామానికి చెందిన సీతారాం, నిర్మల్ జిల్లాలోని సిరిగాపూర్ గ్రామానికి చెందిన అడ్డి నర్సారెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108, ఎన్‌హెచ్‌ఐ అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం నిర్మల్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



బోల్తాపడ్డ మ్యాక్స్ వాహనం

ఆదివాసీలకు సంక్షేమ ఫలాలు అందేలా చూడాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు గిరిజనులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఉట్నూర్ ఐటీడీఏ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో ఐటీడీఏ ద్వారా చేపడుతున్న పనుల పురోగతి, సంక్షేమ పథకాల అమలుపై సంబంధిత శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ఐటీడీఏ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలలో ఇంజినీరింగ్ శాఖ ద్వారా చేపట్టిన మరుగుదొడ్లు, భోజనశాల, ప్రహరీ, స్నానం, అదనపు తరగతి గదులు, ఇతరత్రా పనులను వెంటనే పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బర్త్ వెయిటింగ్ హాళ్లు, అంగన్‌వాడీ భవనాలను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఏఎన్సీ పరిధిలో ముందస్తు చర్యలు చేపట్టాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారుల్లో రక్తహీనత నియంత్రించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. ఆదర్శ గ్రామయోజన పథకం కింద ఎంపిక చేసిన 24 గిరిజన గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలతో పాటు కనీస మౌలిక సదుపాయాలు కల్పించి ఆదర్శ గ్రామాలుగా మార్చే దిశగా తీర్చిదిద్దాలన్నారు. మారుమూల గిరిజన గ్రామాలు, తండా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించే దిశగా రూ. 153 కోట్ల నిధులతో 122 బీటీ రోడ్లను మంజూరు చేసిందన్నారు. నిరుద్యోగ యువత స్వయం ఉపాధి పొందేలా వృత్తి నైపుణ్య శిక్షణలను అందించాలని సూచించారు. సమావేశంలో శిక్షణ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, డెప్యూటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్, ఏపీవో భీంరావు, ఆర్డీవో సురేశ్, ఈఈ రాథోడ్ భీంరావు, అదనపు వైద్యారోగ్యశాఖ అధికారి కుమురం బాలు, ఏపీవో పీవీటీజీ భాస్కర్, ఓఎస్డీ కృష్ణయ్య ఉన్నారు.



సమావేశానికి హాజరైన అధికారులు

ప్రాణం తీసిన మేకల సంత

- రశీదు డబ్బులు ఇవ్వమన్నందుకు దాడి

మామడ: సంతలో మేకలు కొనుగోలు చేసిన వారిని నిర్వహకుడు రశీదు డబ్బులు ఇవ్వమన్నందుకు తీవ్రంగా కొట్టి చంపిన సంఘటన మండల కేంద్రంలో కలకలం సృష్టించింది. పోలీసుల వివరాల ప్రకారం... మండల కేంద్రంలో ప్రతీ బుధవారం మేకల సంత నిర్వహిస్తారు. ఈ సంత నిర్వహణకు మండల కేంద్రానికి చెందిన షేక్‌చాంద్ (57) టెండర్ దక్కించుకున్నాడు. బుధవారం పెంబి మండల కేంద్రానికి చెందిన శివరాత్రి మల్లేష్, శివరాత్రిరెడ్డి, ఎంగ్లాపూర్ గ్రామానికి చెందిన పిట్ల సాయన్న మేకలను కొనుగోలు చేయడానికి వచ్చారు. మేకలు కొనుగోలు చేసిన అనంతరం వారికి షేక్‌చాంద్ రశీద్‌ను అందించి డబ్బులు ఇవ్వాలని కోరాడు. వారు డబ్బులు ఇవ్వమని చెప్పడంతో ఇరువురి మధ్య ఘర్షణ మొదలైంది. ఈ ముగ్గురు షేక్‌చాంద్‌పై దాడి చేసి తలను రాయికి బాదడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం నిర్మల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నవీన్‌కుమార్, ఎస్సై అశోక్ తెలిపారు.



షేక్‌చాంద్ మృతదేహం

రహదారిపై రాస్తారోకో...

షేక్‌చాంద్‌ను హత్యచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. అరగంట పాటు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. సంఘటనా స్థలానికి సీఐ నవీన్‌కుమార్, ఎస్సై అశోక్ చేరుకుని దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలుపడంతో ఆందోళన విరమించారు.

ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి వ్యక్తి మృతి

కాగజ్‌నగర్‌టౌన్: ప్రమాదవశాత్తు రైలులోంచి కిందపడి ఒకరు మృతి చెందినట్లు కాగజ్‌నగర్ జీఆర్‌పీ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపారు. కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ పరిధిలోని వంజీరి రైల్వే గేటు వద్ద మంగళవారం రాత్రి చెన్నై నుంచి గయా వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలులోంచి అనిల్ కుమార్ బర్‌తియా (35) ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. మృతుడు ఏపీలోని వినుకొండలో గల ఓ బైక్ షోరూంలో పనిచేస్తున్నాడు. యూపీ రాష్ట్రంలోని తన అన్నయ్య కూతురు వివాహానికి చెన్నై రైల్వే స్టేషన్‌లో గయా ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ సమీపంలోకి రాగానే కిందపడడతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం సిర్పూర్(టి) సివిల్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కాపర్ దొంగలపై పీడీయాక్ట్

జైపూర్(చెన్నూర్): రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి అందులోని కాపర్ వైరు దొంగిలించిన ఏడుగురు నిందితులపై బుధవారం పీడీయాక్ట్ ఉత్తర్వులు జారీ చేసినట్లు సీపీ రెమా రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. జైపూర్ మండలం ఇందారం గ్రామానికి చెందిన మద్దిపల్లి సాయితేజ , దోనిపల్లి సురేశ్, మీనుగు మల్లేశ్, రేగుంట వర్ధన్, చిప్పకుర్తి రాకేశ్, పులి భరద్వాజ్, మినుగు భానేశ్‌లకు మంథని సీఐ సతీష్ కరీంనగర్ జిల్లా జైలులో పత్రాలు అందజేశారు. అనంతరం నిందితులను చర్లపల్లి జైలుకు తరలించారు. వారిపై గతంలో మంథని, జైపూర్, భీమారం, కోటపల్లి, దండేపల్లి, కాటారం, కాళేశ్వరం, గోదావరిఖని టూటౌన్, అంతర్గాం, బసంత్‌నగర్, ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 41 కేసులు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

వేసవి దుక్కులతో లాభాలు

నిర్మల్‌చైన్‌గేట్: సాగు ఆరంభంలో చేసే కొన్ని పనులు దిగుబడిపై ప్రభావం చూపుతాయి. అటువంటి వాటిలో వేసవి దుక్కులు ప్రధానమని ఏఈవో నాగరాజు సూచిస్తున్నారు. వేసవి దుక్కులు, లాభాలపై ఏఈవో మాటల్లోనే..

పోషకాల పెంపు..

నేలలోపలి గట్టి పొరలను పగులగొట్టడంతో మొక్కల వేరు వ్యవస్థ లోపలికి చొచ్చుకుని వస్తాయి. వేరు వ్యవస్థ నేలలోకి బాగా విస్తరించడంతో మొక్కల ఎదుగుదలకు కావాల్సినంత తేమ పోషకాలు సమకూరుతాయి. దీంతో నాణ్యమైన దిగుబడి వస్తుంది. పంటలకు మేలు చేసే సూక్ష్మ జీవుల చర్యలను కూడా అభివృద్ధి పరిచేందుకు ఈ వేసవి దుక్కులు దోహదం చేస్తాయి.

కలుపు నివారణ..

లోతు దుక్కులతో పొలంలో ఉండే మొండి జాతి కలుపు మొక్కలైన గరిక, తుంగ ఇతర దుంపలతో సహా పెకిలించవచ్చు. దీంతో అవి ఎండిపోయి కలుపు సమస్య తగ్గుతుంది.

పురుగుల నిర్మూలన...

తొలకరి వర్షాలు పడిన వెంటనే భూమిని లోతుగా దున్ని కింది నేలను పైకి వచ్చేట్లు చేయడంతో నిద్రావస్థలో ఉన్న వివిధ పురుగుల గుడ్లు, ప్యూపాలు సూర్యరశ్మి తాకిడికి చనిపోతాయి. వేసవి దుక్కులతో వరి పైరును ఆశించే కాండం తొలుచు పురుగు మొక్కజొన్నలో వచ్చే పురుగుల ఉధృతిని తగ్గించవచ్చు.



దుక్కులు దున్నుతున్న రైతు

నాగరాజు ఏఈవో

తెగుళ్ల నివారణ..

భూమిలో ఉండి సాగుకాలంలో పైరును ఆశించే వివిధ రకాల శిలింధ్రాలు వేసవిలో చేపట్టే లోతు దుక్కులతో ఎండ తాకిడికి చనిపోతాయి. తర్వాత పంట కాలంలో ఈ తెగుళ్ల తీవ్రత తగ్గుతుంది. ఉదాహరణకు వివిధ పంటల్లో వచ్చే తెగుళ్లను వేసవి దుక్కులతో తగ్గించవచ్చు.

లాభాలు...

- నేల గుల్లబారి నీటి నిల్వ శాతం పెరుగుతుంది.
- భూమి లోపల ఉండే వివిధ రకాల పురుగుల గుడ్లు, ప్యూపాలు చనిపోతాయి. కలుపును నివారించవచ్చు.

ఇతర ప్రయోజనాలు..

- ప్రాథమికంగా వేసవి దుక్కుల వలన తొలకరిలో పడే వర్షపు నీరు నేలలోకి బాగా ఇంకి భూగర్భ నీటి మట్టం పెరుగుతుంది. దీంతో పాటు నేలలో తేమ నిల్వ శాతం వృద్ధి చెందుతుంది.
- నీరు బాగా ఇంకడంతో నేల గుల్లబారి విత్తనం నాటేందుకు అనుకూలంగా మారుతుంది. తద్వారా మొలక శాతం పెరుగుతుంది.
- ముందు పంట మొదళ్లు, చెత్త ఆకులు, నేలలో కలిసి సేంద్రియ పదార్థంగా మారి నేల సారం పెరుగుతుంది